# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



# 15 వ భాగం

## మహాలక్ష్మి ఆవిర్భావం

హాలాహలం పరమేశ్వరుడు పానం చేసాక మళ్ళీ పాల సముద్రం చిలకడం సాగించారు దేవ దానవులు. కల్మషాలన్నీ బయటకి పోయాక అప్పుడు అష్ట అణిమా సిద్ధులూ అన్నీ ఒక్కోటిగా బయటకి వస్తాయి అని చెప్పుకున్నాం కదా బ్రహ్మజ్ఞానం సంపాదించే దారిలో? ఆ తర్వాత వరసగా సురభి, ఉచ్ఛైశ్రవం, ఐరావతం, కలవృక్షం, చంద్రుడు, అప్సరసలు పుట్టాక అప్పుడు క్షీరసాగరం లోంచి పుట్టినదే భృగునందన. ఆవిడ ఎలా ఉందంటే,

**క.** **తొలుకారు మెఱుఁగు కైవడి**
**తళతళ మని మేను మెఱవ ధగధగ మనుచున్**
**గలుముల నీనెడు చూపులఁ**
**జెలువంబుల మొదలి టెంకి సిరి పుట్టె నృపా!** [8-265]

వర్షాకాలంలో వచ్చే మెరుపులెలా ఉంటాయో అలాంటి మెరుపులతో ధగ ధగ మని వచ్చిందిట మహాలక్ష్మి. ఎవరికైనా అదృష్టముండి ధనం ప్రాప్తించిందనుకోండి, వాడి ఇల్లూ వాకిలీ అన్నీ కళకళ్ళాడి ధగ ధగమనవూ మర్నాటినుంచీ? అదే ఆవిడ విన్యాసం. బ్రహ్మదేవుడు ఆవిడని ఎలా సృష్టించాడయ్యా అంటే,

**సీ.** **పాలమున్నీటి లోపలి మీఁది మీఁగడ**
**మిసిమి జిడ్డునఁ జేసి మేను పడసి**
**క్రొక్కారు మెఱుఁగుల కొనల క్రొత్తళుకుల**
**మేనిచే గలనిగ్గు మెఱుఁగు జేసి**
**నాఁటి నాఁటికిఁ బ్రోది నవకంపుఁదీవల**
**నునుఁ బోద నెయ్యంబు నూలుకొలిపి**
**క్రొవ్వారు కెందమ్మి కొలఁకునఁ బ్రొద్దునఁ**
**బొలసిన వలపులఁ బ్రోది పెట్టి** [8-266]

**తే.** **పసిడి చంపక దామంబు బాగుఁగూర్చి**

**వాలు క్రొన్నెల చెలువున వాడిఁ దీర్చి**

**జాణతనమునఁ జేతుల జడ్డు విడిచి**

**నలువ యీ కొమ్మ నొగిఁ జేసినాఁడు నేఁడు.** [8-266.1]

పాలసముద్రం మీగడా, బంగారు సంపెంగల దండలూ, ఇలాంటివన్నీ పెట్టి ఏదో ఆషామాషీగా కాకుండా చేతుల జడత్వం అంతా వదిలించుకుని ఇంత అందంగా చేసాడుట. ఇప్పటికీ అమ్మాయిలు మొహం కళకళ్ళాడాలని మీగడ రాసుకోవడం మనకి తెల్సిందే కదా? కవులు రాస్తూ ఉంటారు అమ్మాయి ఇలా ఉంది, పెదాలు అలా ఉన్నాయి, ఆహా ఓహో ఏమి అందం అంటూ. కానీ ఇలా పోతన రాసినట్టు ఎక్కడైనా చూసారా?

సముద్రుడికి ఇటువంటి కూతురు పుట్టేసరికి అందరికీ సంతోషం వేసింది. ఒక్కొక్కరూ ఇప్పుడు బహుమతులు ఇస్తున్నారు. ఆడపిల్ల పుడితే లక్ష్మీ దేవి పుట్టిందిరా అంటారు కదా? ఇందుకేనన్న మాట. అంతరార్ధంగా ఆడ, మగా తేడాలు చూపించకూడదనీ అందరూ సమానమేననీ భాగవతంలో చెప్తున్నట్టు లేదూ?

**సీ.** **తరుణికి మంగళస్నానంబు చేయింత**

**మని పెట్టె నింద్రుఁ డనర్ఘమైన**

**మణిమయ పీఠంబు; మంగళవతులైన**

**వేలుపు గరితలు విమల తోయ**

**పూర్ణంబులై యున్న పుణ్యాహ కలశంబు**

**లిడిరి; పల్లవముల నిచ్చె భూమిఁ;**

**గడిమి గోవులు పంచగవ్యంబులను నిచ్చె;**

**మలసి వసంతుండు మధు వొసంగె;** [8-269]

**తే.** **మునులు గల్పంబుఁ జెప్పిరి; మొగిలుగములు**

**పణవ గోముఖ కాహళ పటహ మురజ**

**శంఖ వల్లకీ వేణు నిస్వనము లిచ్చెఁ;**

**బాడి రాడిరి గంధర్వ పతులు సతులు.** [8-269.1]

స్నానానికి వెలలేని మణిమయ పీఠం ఇంద్రుడూ, దేవతా స్త్రీలు పుణ్యాహ కలశాలు, గోవులు పంచామృతాలు, వసంతుడు తేనే ఇలా అవన్నీ ఒక్కోటిగా ఇచ్చారు.

**క.** **పండిత సూక్తుల తోడుతఁ**

**దుండంబులు చాఁచి తీర్థ తోయములెల్లం**

**దుండముల ముంచి దిగ్భే**

**దండంబులు జలక మార్చెఁ దరుణీ మణికిన్.** [8-270]

ఇవన్నీ పెట్టి స్నానం చేయించారు. మామూలుగా కాదు పండితుల మంగళాసీస్సులతో. ఎవరు చేయించారు? దిగ్వేదండంబులు అంటే దిగ్గజాలు చేయించారు. లక్ష్మిని ఇక్కడ తరుణీ"మణి" అన్నాడు చూసారా? స్త్రీలలో మణి వంటిదైనా, ధన ధాన్యాలూ మణులకీ ఆవిడే కదా రారాణి, అందుకే ఆ ప్రయోగం.

**సీ. కట్టంగఁ బచ్చని పట్టుఁబుట్టపు దోయి**
**ముదితకుఁ దెచ్చి సముద్రుఁ డిచ్చె;**
**మత్తాళి నికరంబు మధ్వాశ మూఁగిన**
**వైజయంతీమాల వరుణుఁ డిచ్చెఁ;**
**గాంచన కేయూర కంకణ కింకిణీ**
**కటకాదులను విశ్వకర్మ యిచ్చె;**
**భారతి యొక మంచి తారహారము నిచ్చె;**
**బాణిపద్మము నిచ్చెఁ బద్మభవుఁడు;** [8-271]

**ఆ. కుండలివ్రజంబు గుండలముల నిచ్చె;**
**శ్రుతులు భద్రమైన నుతులు జేసె;**
**నెల్ల లోకములకు నేలిక సానివై**
**బ్రతికె దనుచు దిశలు పలికె నధిప!** [8-271.1]

ఇప్పుడు కట్టుకోవడానికి పట్టుబట్టలూ, ధరించడానికి వజ్ర వైఢూర్యాలూ తెచ్చి ఇస్తున్నారు. దీవించి ఎల్ల లోకాలకి రాణీవై ఉంటావని దశదిశలూ పలుతుకున్నాయి. సరస్వతి ఒక ముత్యాలహారం, బ్రహ్మదేవుడు ఒక పద్మం కూడా ఇచ్చారు. ఇప్పుడు పెళ్ళి కూతురు సిద్ధమై ఉంది. ఆవిడ ఎవర్ని వరిస్తుందా అని చూస్తున్నారు. ఆవిడ చూపు పడితే జీవితం ఎలా ఉంటుంది? ధన ధాన్యాలూ అవీ వస్తే హరాయించుకోగల శక్తి ఎవరికుంది ఇంతమందిలో? భర్తృహరి నీతి శతకంలో చెప్తున్నాడు చూడండి.

**దానం భోగో నాశస్తిస్రో**
**గతయో భవంతి విత్తస్య**
**యున్న దదాతి న భుక్తే**
**తస్య తృతీయా గతిర్భవతి** **(భర్తృహరి నీతి శతకం - 35)**

ధనం ఉంటే అనుభవించగలగాలి. లేకపోతే అది కావాల్సిన వాళ్ళకీ, పాత్రులైన వాళ్ళకీ దానమివ్వడానికి సిద్ధంగా ఉండాలి ఎందుకంటే ధనానికి నలుగురు దాయాదులున్నారుట – ధర్మం, అగ్ని, రాజు, చోరులు అని. అనుభవించడం చేతకాక, దానమివ్వడం ఇష్టం లేకపోతే ఏమౌతుంది? దాన్ని మూడో

దారిలో పై నలుగురిలో ఎవరో దోచుకుంటారుట. ఎంత బాగా చెప్పాడో చూసారా? ఇప్పుడు చూద్దాం ఇంతమందిలో ఈ రెండు లక్షణాలూ ఉన్నవాళ్ళెవరూ ఇక్కడ? ఎవరైతేనేం? లక్ష్మీ కటాక్షం ప్రాప్తిస్తే ఎలా ఉంటుంది?

**సీ. పలుకుల నమృతంబు చిలుక నెవ్వానితో**
**భాషించె వాఁడెపో బ్రహ్మ యనఁగ**
**నెలయించి కెంగేల నెవ్వని వరియించె**
**వాఁడె లోకములకు వల్లభుండు**
**మెయిదీఁగ నెవ్వని మేనితోఁ గదియించె**
**వాఁడెపో పరమ సర్వజ్ఞమూర్తి**
**నెలతుక యెప్పుడు నివసించె నేయింట**
**నాయిల్లు పరమగు నమృత పదము** [8-273]

**ఆ. నింతి చూపు వాఱె నెచ్చోటి కచ్చోటు**
**జిష్ణుధనద ధర్మ జీవితంబు**
**గొమ్మ చిన్న నగవు గురుతర దుఃఖ ని**
**వారణంబు సృష్టి కారణంబు.** [8-273.1]

ఆవిడ ఎవరితో మాట్లాడుతుందో వాడే ఆనంద బ్రహ్మ. ఎవరిని వరిస్తుందో వాడే లోకాధీశుడు. ఎవరి ఇంట్లో నివసిస్తుందో అదే పరమ అమృతపదము. ఆవిడ చిన్న చూపు పడిందా అదే సృష్టికి కారణం, దుఃఖనివారణం చేసేదీనూ. ఇక్కడ మళ్ళీ భర్తృహరి నీతిశతకం చూద్దాం. ఏమంటున్నాడో చూడండి. డబ్బున్నవాడే కదా అందరికన్నా గొప్పవాడు?

**యాస్యాస్తి విత్తం స నరః కులీనః**
**స పండితస్స శృతవా గుణజ్ఞ**
**స ఏవ వక్తా సచ దర్శనీయః**
**సర్వే గుణాః కాంచనమాశ్రయంతి** **(భర్తృహరి నీతి శతకం - 33)**

డబ్బున్న వాడే గొప్ప కులంలో ఉన్నవాడు. వాడే మహా పండితుడు, శాస్త్రాలన్నీ ఎరిగినవాడు. గొప్ప వక్త. గుణదోషాలు తెలిసినవాడు, రూపవంతుడు, అందరికీ దర్శనీయుడు అని ప్రతీతి. అంటే ధనం ఒక్కటుంటే చాలు. అన్ని గుణాలూ కాంచనాన్ని ఆశ్రయించి ఉన్నాయి. పోతన కూడా ఇదే కదా చెప్తున్నాడు? భాగవతం తెనిగిస్తూ మొదట్లో "భాసురతన్ లేములు వాపు తల్లి, సిరి యిచ్చున్ నిత్యకల్యాణముల్ " అని రాసిన వాడు ఇక్కడ లోకరీతిని – ధనం మూలమిదం జగత్ – అని ఎంత చమత్కారంగా చెప్పాడో గమనించారా?

ఇప్పటి వరకూ లోకరీతే గానీ లక్ష్మి మనసులో ఏముందో తెలియదు. అంటే నాకు డబ్బులు కావాలి అనుకుంటే సరిపోదు కదా? ఆవిడ అనుగ్రహం ఉండాలి. ఇప్పుడు ఆవిడ మనసులో ఏముందో చెప్తున్నాడు.

**సీ. భావించి యొకమాటు బ్రహ్మాండ మంతయు**
**నాటల బొమ్మరిల్లని తలంచుఁ**
**బోలించి యొకమాటు భువనంబు లన్నియుఁ**
**దన యింటిలో దొంతులని తలంచుఁ**
**బాటించి యొకమాటు బ్రహ్మాది సురులను**
**దన యింటిలో బొమ్మలని తలంచు**
**గొనకొని యొకమాటు కుంభినీచక్రంబు**
**నలవడ బొమ్మపీఁటని తలంచు** [8-275]

**ఆ. సొలసి యొక్కమాటు సూర్యేందురోచుల**
**నచటి దీపకళిక లని తలంచు**
**భామ యొక్క మాటు భారతీదుర్గల**
**నాత్మసఖు లటంచు నాదరించు.** [8-275.1]

ఈ బ్రహ్మాండం అంతా ఒక బొమ్మరిల్లనీ, ఈ లోకాలన్నీ ఒకదాని మీద ఒకటిగా పెట్టిన పిడతలనీ భావిస్తోంది. ఈ బ్రహ్మాది దేవతలందరూ తన ఇంట్లో బొమ్మలు అనుకుంటోందిట. సూర్య చంద్రులు దీపానికి కళికలు అని తలుస్తోందిట. అంటే జగన్మాతకి ఇవన్నీ చిన్న చిన్న విషయాలు.

**ఆ. చంచరీకనికర ఝంకార నినదంబు**
**దనరు నుత్పలముల దండ పెట్టి**
**మేఘకోటి నడిమి మెఱుఁగుఁ బుత్తడి మాడ్కి**
**సురల నడుమ నిల్చె సుందరాంగి.** [8-277]

ఇలాంటి లక్ష్మి ఇప్పుడు మేఘాల్లో మెరుపుల మధ్య పుత్తడి బంగారపు బొమ్మలా దేవతల మధ్య నిలుచుని ఉంది. ఎవర్ని వరిద్దామా అని. కానీ ఆవిడ చూపు ఎవరి మీద ఉంది?

వ. అట్లు నిలిచి దశ దిశలం బరివేష్టించి యున్న యక్ష రక్షస్సిద్ధ సాద్ధ్యదివిజ గరుడ గంధర్వ చారణ ప్రముఖ నిఖిల యూథంబులం గనుం గొని యప్పురాణ ప్రౌఢకన్యకారత్నంబుఁ దన మనంబున నిట్లని వితర్కించె. [8-279]

లక్ష్మిని ఇక్కడ పోతన ఏమన్నాడో గమనించారా? పురాణప్రౌఢకన్యకారత్నంబు. అందరికేసీ ఓ సారి చూసి ఇలా అనుకుంటోంది.

సీ. ఐదువనై యుండ నలవడ దొక చోట
నొకచోట సవితితో నోర్వ రాదు
తగ నొకచోట సంతత వైభవంబుఁ గా
దొకచోట వేఁడిమి నుండఁ బోల
దొకచోటఁ గరుణ లే దొక్కింత వెదకిన
నొకచోట డగ్గఱి యుండఁ బెట్ట
నెఱయంగ నొకచోట నిలుకడ చాలదు
చర్చింప నొకచోట జడత గలదు [8-280]

ఆ. కొన్నిచోట్ల కామగుణ గరిష్ఠంబులు
క్రోధ సంయుతములుఁ గొన్ని యెడలు
గొన్ని మోహలోభకుంఠితంబులుఁ గొన్ని
ప్రమద మత్సరాను భావకములు. [8-280.1]

ఒక చోట ముత్తైదువలా ఉండడం కుదరదు అంటే ఇంతమంది సురశ్రేష్ఠులు కూడా ఎప్పుడో ఒకసారి జీవితం చాలించవల్సిందే వాళ్ల పుణ్యం అయిపోగానే. ఇంకోచోట సవతిపోరు ఉండొచ్చు (బ్రహ్మ, శివుడు). ఇంకోచోట ఉండే వైభవం శాశ్వతం కాదు. ఇంకోచోట విపరీతమైన వేడి. మరింకోచోట కరుణ అనేదే కనబడదు. మళ్ళీ మరోచోట నిలకడ లేదు, జడత్వం అధికంగా ఉంది. కొన్నిచోట్ల కామ క్రోధాలు ఎక్కువగా ఉన్నాయి. వేరేవాళ్ల దగ్గిర మద, మోహ, మాత్సర్యాలు ఉన్నాయి. ఇంక మిగిలినది మహా విష్ణువు ఒక్కడే. ఆయన దగ్గిర ఎలా ఉంటుందో?

సీ. అమర ముత్తైదువనై యుండ వచ్చును
వరుసకు సవతు లెవ్వరును లేరు
వెలయంగ నశ్రాంత విభవ మీతని యిల్లు
శృంగార చందన శీతలుండు
గలఁగఁ డెన్నఁడు శుద్ధకారుణ్యమయమూర్తి
విమలుండు గదిసి సేవింప వచ్చు
నెఱి నాడి తిరుగఁడు నిలుకడఁ గలవాఁడు
సకల కార్యములందు జడత లేదు; [8-282]

ఆ. సాధురక్షకుండు షడ్వర్గ రహితుండు
నాథుఁ డయ్యె నేని నడప నోపు
నితఁడె భర్త యనుచు నింతి సరోజాక్షుఁ

**బుష్ప దామకమునఁ బూజచేసె.** [8-282.1]

ఈయన దగ్గిరైతే అమర ముత్తైదువలా ఉండవచ్చు.  దెబ్బలాడే సవతులెవరూ లేరు. ఎప్పుడూ వీడిపోని వైభవం ఉన్నవాడు. శృంగార చందన శీతలుండు – శృంగారుడు, మంచి గంధం అంత చల్లని వాడు. స్వచ్ఛమైన వాడు. మాట పలికి వెనక్కి తీసుకునేవాడు కాదు. అన్ని కార్యాలలోను అలసత్వం లేని వాడు. సాధు రక్షకుడు, కామాది దోషాలు లేని వాడు. ఇతన్ని సేవించవచ్చు అనుకుని ఆయన మెడలో వరమాల వేసింది లక్ష్మీ దేవి. ఈ సీస పద్యంలో అమ్మాయిలు పెళ్ళికి ముందు కాబోయే భర్త ఎలా ఉంటే మంచిదనుకుంటారో చెప్తూ అలవోకగా భగవంతుడి గుణాలన్నీ ఎంత హృద్యంగా ఇరికించాడో పోతన!

ఇప్పుడు లక్ష్మి,  విష్ణువు ఒకరి కేసి ఒకరు ఎలా చూసుకుంటున్నారో చెప్తున్నాడు – పెళ్ళిలో దొంగ చూపులు చూసుకున్నట్టు అన్నమాట.

క. **హరి చూచిన సిరి చూడదు**

**సిరి చూచిన హరియుఁ జూడ సిగ్గును బొందున్**

**హరియును సిరియునుఁ దమలో**

**సరిఁజూపులఁజూడ మరుఁడు సందడి పెట్టెన్.** [8-285]

మొదటి పాదం (హరి చూసిన సిరి చూడదు) లో ఇంకో అర్ధం దాగి ఉంది గమనించారా? శ్రీహరి మనకేసి చూసాడంటే – మనం ఆయన ప్రాపకం కోసం అడుగుతున్నాము అంటే – మన సిరి అంతా పోయినట్టే, బలి మహారాజుకి జరిగినది అదే కదా? అంటే జీసస్ చెప్పినట్టూ, సూది బెజ్జం లోంచి ఒంటె అయినా దూరగలదు గానీ స్వర్గ ద్వారంలోకి ధనికుడు వెళ్ళగలడం అసంభవం. అందుకే మోక్షం కావాలంటే సన్యసించి తీరాలి. సన్యసించడం అంటే మనసులో అన్నమాట – జనకుడిలాగా ఉండొచ్చు అనుకోండి, కానీ ఎంతమందికి అటువంటి వైరాగ్యం అబ్బుతుంది?

వ. అట మున్న యబ్ధిరాజు దనయందు నున్న యమూల్యంబైన కౌస్తుభంబు పేరిటి మణిరాజంబు నయ్యంబుజాక్షునకు సమర్పించిన దానిం దన వక్షస్థలంబున ధరియించె; నప్పు డ య్యాదిలక్ష్మియు శ్రీవత్స కౌస్తుభ వైజయంతీవనమాలికా తారహారాద్యలంకృతంబైన పుండరీకాక్షు వక్షంస్థలంబున వసియించె నయ్యవసరంబున. [8-287]

ఇప్పుడు మామగారు అల్లుడికి వెలలేని కౌస్థుభం కానుకగా ఇచ్చాడు. అది భగవంతుడు వక్షస్థలంలో ఉంచుకున్నాడు. అప్పట్నుంచీ లక్ష్మి – వైజయంతీవనమాలికాతారహారాద్యలంకృతంబైన – ఆయన ఎదమీద నివశించింది. అంటే భార్యని అపురూపంగా చూసుకుంటున్నాడన్నమాట.

శా. **మ్రోసెన్ శంఖ మృదంగ వేణురవముల్ మున్నాడి; పెంజీఁకటుల్**

**వాసెన్; నర్తన గాన లీలల సురల్ భాసిల్లి; రార్యుల్ జగ**

**ద్వాసుల్ విష్ణుని బ్రహ్మ రుద్ర ముఖరుల్ తల్లింగమంత్రంబులం**

**బ్రాసక్తిన్ వినుతించి రుల్లసిత పుష్ప శ్రేణి వర్షించుచున్.** [8-288]

దీనితో చీకట్లన్నీ తొలగిపోయి దేవతల నర్తనం, గానం, స్తోత్రాలూ మిన్నంటాయి. అంటే ఎప్పుడైతే మనం ఇవన్నీ భగవంతుడికి అర్పించామో అప్పుడు బ్రహ్మజ్ఞానం సంపాదించడంలో ముందుకెళ్ళడానికి దారి ఇంకా సుగమం అయిందన్నమాట. ఆ దారిలో ఉండే అనుగ్రహమే ఇదంతా.

క. **పాలేటి రాచకన్నియ**
**మే లారెడు చూపులేక మిడు మిడు కంచున్**
**జాలిం బురపురఁ బొక్కుచుఁ**
**దూలిరి రక్కసులు కీడు దోఁచిన నధిపా!** [8-290]

లక్ష్మి విష్ణువుని వరించగానే రాక్షసులకి కీడు అనిపించింది – అంటే ధనం అంతా పోయాక కలిగే ఆలోచనలు అన్నమాట.

లక్ష్మీదేవి విష్ణువుని వరించడంలో పోతన ఎంతటి అద్భుతమైన పద్యాలు రాసాడో చూసారా? మళ్ళీ చిన్న పిట్ట కథ. రాజాజీ ఒకసారి గాంధీ గారితో మాట్టాడుతోన్నప్పుడు, “రాజాజీ మీరు రామాయణం రాయకూడదూ” అన్నారుట గాంధీ. "అబ్బే నేను ఒక ప్రేమ కథ రాద్దామనుకుంటున్నానండి" అని చెప్పేరుట రాజాజీ. గాంధీ చురుగ్గా ఓ చూపుచూసి, "రామాయణం ప్రేమ కథే కదా? సీత మీద ప్రేమ లేకపోతే అంత దూరం కాలి నడకన వెళ్ళి ఉండేవాడా రాముడు?" అన్నార్ట. అందువల్లనే తాను రామాయణం రాసానని చెప్తారు రాజాజీ. రాజాజీ రాసిన ఆ "ప్రేమ కథ" ఉత్తరోత్తరా ఎంత ఖ్యాతి పొందిందో అందరూ ఎరిగిందే కదా? అలాగే ప్రేమ కథ అంటే దేముడు ఉండకూడదనుకునే వారిని మళ్ళీ మళ్ళీ ఆలోచింపచేసేదీ మహాభాగవతంలో ఘట్టం.

చివరిగా, ఇందులో ఉన్న మహా లక్ష్మి వర్ణనకి శంకర భగవత్పాదులు కనక ధారా స్తోత్రం లో రాసిన వర్ణన సరిపోతుంది చూడండి. మొదటి శ్లోకంలో సాగరసంభవాయా అనీ, రెండో దానిలో ఇందీవరోదర సహోదరమిందిరాయా అనీ సంభోధించారు శ్రీ శంకరులు లక్ష్మీదేవిని. పోతన చెప్పినదీ అదే కదా?

**ముగ్ధా ముహుర్విధధతీ వదనే మురారే ప్రేమప్రపాత ప్రణిహితాని గతాగతాని**
**మాలా దృశోర్మధుకరీవ మహోత్పలేయా సామేశ్రియం దిశతు సాగర సంభవాయా** (2)

[ ఒక పెద్ద కమలము చుట్టూ పరిభ్రమించు తుమ్మెద వలె విష్ణువు మోముపై వెల్లువెత్తిన ప్రేమను మాటిమాటికి ప్రసరింపచేయు శ్రీ మహాలక్ష్మీ కటాక్ష పరంపర నాకు సంపదలను అనుగ్రహించుగాక ]

**విశ్వామరేంద్ర పదవిభ్రమ దానదక్ష మానంద హేతురధికం మురవిద్విషోపి**
**ఈషన్ని షీదతుమయి క్షణమీక్షణార్ధ మిందీవరోదర సహోదరమిందిరాయా** (3)

[ ఇంద్రాది దేవతలకి ముల్లోకాలనీ కట్టబెట్టగలిగిన దయతో కూడిన విష్ణువు కి ఆనందం చేసే చూపులు కల తల్లీ, ఒక్క క్షణం నీ కరుణాపూరిత చూపులు మాపై ప్రసారం చేయి ]

లక్ష్మీదేవిని కీర్తిస్తూ ఇంకా శంకరులేమంటున్నారో చదివి వ్యాసం ముగిద్దాం.

శ్రుత్యై నమోస్తు శుభకర్మ ఫల ప్రసూత్యై రత్యై నమోస్తు రమణీయ గుణార్ణవాయై
శక్తై నమోస్తు శతపత్ర నికేతనాయై పుష్టై నమోస్తు పురుషోత్తమ వల్లభాయై

నమోస్తు నాళీక నిభాననాయై నమోస్తు దుగ్ధోదధి జన్మభూమ్యై
నమోస్తు సోమామృత సోదరాయై నమోస్తు నారాయణ వల్లభాయై

నమోస్తు హేమాంభుజపీఠికాయై నమోస్తు భూమండల నాయికాయై
నమోస్తు దేవాది దయాపరాయై నమోస్తు శార్ఙ్గాయుధ వల్లభాయై

నమోస్తు దేవ్యై భృగునందనాయై నమోస్తు విష్ణోరురసి స్థితాయై
నమోస్తు లక్ష్మై కమలాలయాయై నమోస్తు దామోదర వల్లభాయై

నమోస్తు కాంత్యై కమలేక్షణాయై నమోస్తు భూత్యై భువన ప్రసూత్యై
నమోస్తు దేవాదిభి రర్చితాయై నమోస్తు నందాత్మజ వల్లభాయై (11-15)

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS